

ప్లాస్టిక్ నిషేధ నిబంధనలు కఠినతరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. దీనికి వ్యాపార వర్గాలు, వినియోగదారులు సహకరించాలని కోరారు. మానవాళికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ నిషేధానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, వారి నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలో మున్సిపల్, పోలీసు అధికారులతో కూడిన 5 శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్ఫోర్స్మెంట్ టీమ్స్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ తెలిపారు. చెప్పారు. గతేడాది కాలంలో ఈ బృందాలు 370 చోట్ల దాడులు నిర్వహించి.. 4.75 టన్నుల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

వేసవి శిక్షణలో విజ్ఞానం.. వినోదం..

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

వేసవి శిక్షణా తరగతులలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరంలోని శ్రీ కందుకూరి వీరేశలింగం పాఠశాల ప్రాంగణం ఈ శిక్షణా తరగతులకు వేదిక అయ్యింది. గోదావరి బాలోత్సవం, రాజమండ్రి చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌కెవిటి పాఠశాలలో మే 5వ తేదీ నుంచి ఉచిత వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో బాలాజీదాస్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సహకారంతో 9వ తగతి పూర్తి చేసి పదో తరగతికి వెళ్తున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విజ్ఞానం, వినోదం కలగలిపి నిర్వహిస్తున్న రెండు కార్యక్రమాలలో సుమారు 400 మంది విద్యార్థులు ప్రతి రోజూ హాజరవుతున్నారు. వేసవి సెలవులను ఉత్సాహంగా గడుపుతున్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు



శిక్షణా శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

మంచి స్నేహితులు లభించారు

వేసవి శిక్షణా తరగతులకు మే 5 నుంచి హాజరవుతున్నాను. ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ క్లాసులలో చక్కగా నేర్పించారు. మా స్కూలుతో పాటు నగరంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఇక్కడి తరగతులకు హాజరయ్యారు. దీంతో మంచి స్నేహితులు లభించారు.

- జె. సూర్య, 9వ తరగతి శ్రీ చైతన్య స్కూలు.



మేజిక్ షో ఆశ్చర్యపరిచింది

వేసవి శిక్షణా తరగతులలో భాగంగా నిర్వహించిన మేజిక్ షో ఆశ్చర్య పరిచింది. కరాటే, కోలాటం, పాటలు, డ్యాన్స్, హాండ్ రైటింగ్, డ్రాయింగ్, ఫన్ మ్యాథ్స్‌తో పాటు ఆటలు టీమ్ గేమ్, మెమరీ గేమ్స్ ఇలా అనేక క్లాసులు నిర్వహించారు. ప్రతి తరగతి ఏంతో ఆసక్తిగా ఉన్నాయి. మేజిక్ షో నాకు బాగా నచ్చింది.

- పి.శాలినిశ్రీ, కేంద్రీయ విద్యాలయం 8వ తరగతి.



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



ఫన్ మ్యాథ్స్ ఆకట్టుకున్నాయి

ఫన్ మ్యాథ్స్ తరగతులు ఆకట్టుకున్నాయి. సహజంగా మ్యాథ్స్ అంటే కొంత ఆందోళన ఉండటం సహజం. ఫన్ మ్యాథ్స్ తరగతులు ఆ భయాన్ని పోగొట్టాయి. ఆ సబ్జెక్ట్ బోధించిన ఉపాధ్యాయులు అర్థమయ్యేలా బోధించారు. అదే విధంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉండటంతో ఒకరికొకరు ఆలోచనలు పంచుకోవటం మరింత ఆనందంగా అనిపించింది.

- సిహెచ్‌విటి.కృష్ణవేణి, 8వ తరగతి తిరుమల స్కూల్స్.



విజ్ఞానం, వినోదం, ఆరోగ్యంపై అవగాహన

వేసవి శిక్షణా తరగతుల నిర్వహణలో భాగంగా విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించే తరగతులు నిర్వహించటంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నాము. నగరంలోని 25 ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి విద్యార్థులు హాజరవుతున్నారు. 11 మందికిపైగా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. శ్రీ రామ్ డెంటల్ క్లినిక్ ద్వారా డెంటల్ ఫ్రీ చెకప్‌లు, మాక్స్ విజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించాము. పవన్ యాపిల్ డెంటల్ క్లినిక్ వారు విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

- టి.తులసి, గోదావరి బాలోత్సవం, ప్రధాన కార్యదర్శి.

40 రోజులపాటు ఉచిత శిక్షణా తరగతులు

బాలాజీ దాస్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సహకారంతో 40 రోజుల పాటు ఉచిత శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఎస్‌కెవిటి పాఠశాల ప్రాంగణం ఈ తరగతులకు వేదికైంది. 9వ తరగతి పూర్తి చేసి 10వ తరగతికి వెళ్లే విద్యార్థుల కోసం ఈ తరగతులు నిర్వహించి పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తున్నాము గత పదేళ్లుగా ట్రస్టు ఆధ్వర్యంలో ఇటువంటి తరగతులు నిర్వహిస్తున్నాము. ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఆటవిడుపుగా పాటలు, డ్యాన్స్ తరగతులు కూడా నిర్వహించటంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

- ఎన్.రాజా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

తల్లిదండ్రులు ప్రోత్సహించారు

వేసవి శిక్షణా తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ప్రతి రోజూ ఇక్కడి తరగతులకు హాజరవుతున్నాను. నాకు కరాటే అంటే ఇష్టం. కరాటే క్లాసులను చక్కగా బోధించారు. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను గురించి తెలుసుకున్నాము. మ్యూజిక్, సాంగ్స్, కోలాటం వంటివి నేర్చుకోవటం చాలా సంతోషాన్నిచ్చింది.

- ఎం. నాగసాయి లోహిత, 6వ తరగతి, మున్సిపల్ హై స్కూల్, నెహ్రూ నగర్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేస్తూ.. నగరాన్ని అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అన్ని విభాగాల హెచ్‌ఒడిలతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారం రోజులుగా వచ్చిన అర్జీలపై యాక్షన్ టేకెన్ రిపోర్టు సిద్ధం చేయవలసిందిగా ఆదేశించారు. నగరాభివద్ధిలో భాగంగా జరుగుతున్న పనులను సమీక్షించడంతో పాటు చేపట్టవలసిన పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజా వల్లి, సూపరిటెండింగ్ ఇంజనీర్ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ వినూత్న, రెవెన్యూ అధికారి సీహెచ్.శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై జెసి సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తితో కలిసి సమన్వయ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, వేసవి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, ఇందు కోసం ప్రజలకు ఎక్కడికక్కడ చల్లని తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. శనివారం ముఖ్య కూడళ్లలో, సచివాలయం పరిధిలో ఆయా ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దష్యా షేడ్స్, తాగునీరు, మెడికల్ శిబిరాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పశుపక్ష్యాదుల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 202 పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే నేపథ్యంలో వృద్ధులు, చిన్నారుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని, అందులో భాగంగా ప్రత్యేక అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని జెసి ఆదేశించారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని జెసి పేర్కొన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో, చెట్ల వద్ద అటువంటి సమయంలో ఉండకూడదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

రైతు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి


పొలంలో పడిన విద్యుత్ వైర్లు కారణంగా ప్రమాదం బారిన పడి మరణించిన పాడి రైతు కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం అందజేశారు. తుపాకులగూడెంకు చెందిన గుల్లపూడి వీర వెంకట సత్యనారాయణ 2023లో విద్యుత్ వైర్లు పడిపోవడంతో విద్యుదాఘాతంతో మరణించారు. ఆయన కుటుంబానికి ఎపిఇపిడిసిఎల్ నుంచి ఎక్స్‌గ్రేషియా మంజూరు కావడంతో ఆ చెక్కును సత్యనారాయణ భార్య శైలజకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు కె.రామకృష్ణ, నాయకులు జివి, ఎం.శివరామకృష్ణ, అనపర్తి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-తాళ్లపూడి

గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే తమ ఆశయమని పెద్దేవం గ్రామ పాలకవర్గ సభ్యులు వైసిపి నాయకులు తోట రామకృష్ణ అన్నారు. గ్రామంలో సుమారు రూ.10 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎంపిపి జొన్నకూటి పోసిరాజు ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటి నాగేశ్వరరావు, కోడి గంగారావు, ఆర్.త్రిమూర్తులు, బి.శ్రీను, టి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్త-కొవ్వూరు

ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలని కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత స్పష్టం చేశారు. గురువారం స్థానికచ ఆర్‌డిఒ కార్యాలయంలో జిల్లా ఫ్యాక్టరీ విభాగం ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో ఉన్న పలు పరిశ్రమలు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రాణి సుస్మిత మాట్లాడుతూ, పరిశ్రమల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాలను అనుసరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో కొన్ని నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదకర వ్యర్థాలు విడుదల చేసే పరిశ్రమలు నెల రోజులకు, మూడు నెలలకు, ఆరు నెలలకు తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆయా పరిశ్రమలలో అలార్మింగ్, సెన్సార్ పరికరాలు ఖచ్చితంగా పనిచేసేలా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడు శాఖల ఆధర్యాన ఏర్పాటు చేసిన కమిటీ ప్రతి పరిశ్రమ ప్రమాణాలు ఖచ్చితంగా పాటిస్తున్నారో లేదో తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు. పరిశ్రముల వారు వినియోగిస్తున్న రసాయనాలు, వాటి యొక్క పరిమాణలు, తీసుకోవలసి ఈ జాగ్రతలు, మాక్ డ్రిల్, కమిటీ సమావేశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫ్యాక్టరీ తనిఖీ అధికారి జి.స్వాతి, అగ్ని మాపక అధికారి పి.శ్రీనివాస్, వివిధ కర్మాగారాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రాణిసుస్మిత

పోస్టల్ కార్యాలయాలలో తనిఖీలు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని గోపాలపురం సబ్ పోస్ట్ ఆఫీస్, నందిగూడెం బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌ను తాడేపల్లిగూడెం పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోపాలపురం సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో ఒకటి హెడ్ పోస్ట్ ఆఫీస్, 36 సబ్ పోస్ట్ ఆఫీసులు, 194 బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులు ఉన్నాయని తెలిపారు. ప్రతి పోస్ట్ ఆఫీస్ పనితీరు, లావాదేవీలు తప్పనిసరిగా ఆడిట్ చేస్తామన్నారు. ఇన్సూరెన్స్, ప్రీమియం, సేవింగ్స్ (ఆర్‌డి), సుకన్య, ఫిక్స్ డిపాజిట్ లు, అకౌంట్స్ లావాదేవీలపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఖాతాదారుల పాస్ బుక్కులకు ఆన్‌లైన్‌లో జమ చేసిన నగదు వివరాలను పరిశీలించినట్టు చెప్పారు. తపాలా శాఖ ద్వారా ఇన్సూరెన్స్, డిపాజిట్లు వడ్డీ రేట్ల యొక్క వివరాలను ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. తపాలా శాఖలో ప్రీమియం తక్కువగా ఉంటుందని, బోనస్ మాత్రం అధికంగా ఉంటుందని తెలిపారు. ఒక ఏడాది నుంచి 10 ఏళ్లలోపు సుకన్య యోజన ఆడపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందని, అధిక ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పోస్టల్ సర్వీస్ ద్వారా ఎటువంటి ఇబ్బంతులూ, సమస్యలు ఉంటే ఫిర్యాదు చేసేందుకు 9966339482 నెంబర్‌కు కాల్ చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలలో పోస్టల్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.సుబ్రమణ్యం, ఇన్‌ఛార్జి పోస్టుమాస్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

శశి వేలివెన్ను విద్యార్థులకు స్టేట్ ర్యాంకులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పాలీసెట్ ఫలితాలలో శశి వేలివెన్ను క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు మరోసారి స్టేట్ ర్యాంకులతో సత్తా చాటారని విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. గురువారం వేలివెన్ను శశి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 120 మార్కులకు గాను 120 మార్కులు తమ విద్యార్థులు ఐదుగురు సాధించారని వీరిలో, బి.శశి వెంకట్ 120కి 120 మార్కులతో స్టేట్ 1వ ర్యాంకు, ఎం.చంద్రహర్ష స్టేట్ 3వ ర్యాంకు, యు.సిరిదీపిక స్టేట్ 13వ ర్యాంకు, వై.చంద్రకుమార్ స్టేట్ 17వ ర్యాంకు, ఎం.దుర్గా శ్రీనిధి స్టేట్ 19వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. 10లోపు ఇద్దరు, 50 లోపు 11 మంది, 100 లోపు 19 ర్యాంకులు సాధించారన్నారు. పాలిసెట్‌లో తమ విద్యార్థులు 14 సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మొదటి ర్యాంకర్ శశి వెంకట్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ తన లక్ష్యంగా చదువు కొనసాగిస్తానన్నాడు. పాలిసెట్‌తో పాటు ఎపిఆర్‌జెసిలో కూడా శశి తమ విద్యార్థులు సత్తా చాటినట్టు రవికుమార్ తెలిపారు. ఎం.వేదార్షిత, ఎంఇసి, ఎస్.చరణ్ సిజిడిటి, డి.సాయిచరణ్ ఇఇటిలోనూ స్టేట్ మొదటి ర్యాంకులు సాధించారని తెలిపారు. 10 లోపు 25, 50 లోపు 55, 100 లోపు 65 ర్యాంకులు సాధించారని, ఎపిఆర్‌ఎజెసిలో తమ విద్యార్థులు 17సార్లు స్టేట్ ఫస్టు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శశి విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ, డైరెక్టర్ ఎం.భాస్కర్, ప్రిన్సిపల్ షేక్ షానూర్ విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

పోలవరం ప్రాజెక్టుపై అధికారుల సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పోలవరం ప్రాజెక్టుకు సంభందించి భూసేకరణపై ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ ఆర్ అండ్ ఆర్, ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. చింతూరు డివిజన్ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ కోసం గుర్తింపు, ముంపునకు గురైన భూములకు సంబంధించి భూమికి బదులు భూమి భూసేకరణ సంబందించి సమావేశంలో స్పెషల్ కలెక్టర్లు, చింతూరు డివిజన్లోని అన్ని భూసేకరణ అధికారులు, ఆర్‌డిఒ, అండ్ అర్ ఎండ్ ఆర్ అధికారి జంగారెడ్డిగూడెం పిఒ ఆయా మండలాల్లోని తహశీల్దార్లు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అంకితభావం, నిబద్ధత చూపడం ద్వారా సకాలంలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ లక్ష్యాలను త్వరితగతిన సాధించాలని ఆదేశించారు.

సైన్యానికి మద్దతుగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలో జాతీయ జెండాలతో శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు మీదగా దేవీచౌక్ వరకూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అమర జవాన్ మురళీ నాయక్‌కు జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఘనంగా నివాళులర్పించి, మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పగలిగామన్నారు. దీంతో ప్రపంచ దేశాలలోని భారత్ ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని కూటమి నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం వెలుగు భవనంలో బిసి సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను శుక్రవారం జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని, ఇదే కూటమి ప్రభుత్వం విధానమని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ప్రతి ఒక్క మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విధానానికి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కూడా ఆర్థిక సహాయం అందిస్తుందని, తద్వారా ఇంతకంటే పెద్ద కుట్టు మిషన్లు ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తహశీల్దార్ సాయి ప్రసాద్, ఎంపిడిఒ ఎం.గోవింద్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని వెదురుపాకలో అప్పన్న చెరువులో పూడికతీత పనులు శుక్రవారం ఎపిఒ పిఎస్ అప్పలరాజు ఆధ్వర్యంలో డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో ఉపాధి పని చేస్తున్న వేతనదారులు మస్టర్లు పరిశీలించారు. వేతన దారులు పని వద్ద ఏర్పాటు చేసిన నీడ, మంచినీరు, ప్రథమ చికిత్స, వంట అంశాలను వేతనదారులను అడిగి తెలుసుకున్నారు.

కిశోర బాలలకు అవగాహన


ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని సింగవరం, తాళ్లపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాల గురించి రక్తహీనత గురించి బాలికలకు వివరించారు. కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో యు.కళ్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.ఇందిర, ఎం.సుజాత, జె.రత్నశ్రీ, పి.పద్మ, ఎస్.లిల్లీ పుష్ప, డి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ అధికారి పి.సరోజకు పురస్కారం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని సమిశ్ర గూడెంగూడెం బిసి బాలికల వసతి గృహం సంక్షేమాధికారి పి.సరోజ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో బిసి బాలికల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులు ఈ సంవత్సరం పరీక్ష రాయిగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు అమరావతిలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ద్వారా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎపిఎన్‌జిఒఎస్ నిడదవోలు తాలూకా అధ్యక్షుడు కె.నందీశ్వరుడు, కార్యదర్శి కె.జయంత్ తదితరులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న పి.సరోజ

టార్గెట్ బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి-చాగల్లు

ఈ నెల 17, 18 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 15న జరిగిన జిల్లా స్థాయి ఎంపికలలో 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ విజయలక్ష్మి తెలిపారు. అందులో 12 మంది బాలికలు, 8 మంది బాలురు ఉన్నారని తెలిపారు. బాలికల్లో జి.రోషిణి, జి.జాహ్నవీదేవి, వి.శాంతి, ఇ.హారిక, టి.ప్రసన్న, డి.మౌనిక, కె.జ్ఞానేశ్వరి, డి.దుర్గాభవాని, గీతా శ్రావణి, నవ్య, ఎ.నైమ, డి.కుందన్ బాలురులలో, బాలానంద కిషోర్ విజయానంద్ జె.తేజ, విజయ్ చరణ్ జె.సూర్య, వినయ్, వి.అభిరామ్, జి.గణేష్, భార్గవ్ ఎంపికయ్యారని పీడీ విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం మోహన్ కృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్ గోపాలకృష్ణ అభినందించారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు మహిళల అరెస్ట్

ప్రజాశక్తి - శంఖవరం

ఆర్‌టిసి బస్సుల్లో జరిగిన రెండు చోరీ కేసుల్లో ఇద్దరి మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఈ కేసులకు సంబంధించిన వివరాలను ఎస్ఐ హరిబాబు వెల్లడించారు. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికుల దృష్టిని మళ్లించి చోరీలకు పాల్పడిన వారిపై నమోదు అయిన కేసుల్లో విచారిస్తున్న నేపథ్యంలో అన్నవరం ఆర్‌టిసి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులో తీసుకుని విచారించినట్లు తెలిపారు. అన్నవరం స్టేషన్ పరిధిలో చోరీ అయిన బంగారం కేసులోనూ, ప్రత్తిపాడు స్టేషన్ పరిధిలో రూ.1.50 లక్షల నగదు చోరీ కేసులో ముద్దాయిలైన నక్క వెంకటేష్, నక్క మంగలను అరెస్టు చేసి వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బస్సులో ప్రయాణం చేసినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి సెలవులు దృష్ట్యా ఎవరైనా తమ ఊరు విడిచి వేరే ప్రాంతానికి వెళ్లేటప్పుడు ఇంటికి తాళాలు వేయడంతోపాటు, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

చోరీ కేసులో నిందుతుని అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల పరిధిలో ద్విచక్రవాహనాలను చోరీలు చేసే నిందుతుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం. .గంగవరం మండలం రామదేవపురం గ్రామానికి చెందిన ఎస్.రామకృష్ణ పలు ద్విచక్రవాహనాలను దొంగిలించాడు. జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదు అయిన కేసుల్లో అతనిని అరెస్టు చేసి 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్థానిక గణేష్ కాలనీకి చెందిన పిట్ట రాజేష్ (23) మృతి చెందాడు. 20 రోజుల క్రితం సామర్లకోట బ్రౌన్ పేట సెంటర్లో మెయిన్ రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తున్న పిట్ట రాజేష్ వీడియోలను తీసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని కొందరు యువకులు బెదిరించారు. మనస్థాపానికి గురైన అతను గత నెల 25వ తేదీ రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. నాటి నుంచి కాకినాడలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే గురువారం అతని ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసామన్నారు. దీనికి సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. జె.కొత్తూరు గ్రామంలో బెల్లం వ్యాపారిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఘర్షణ -21 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఒక వివాహ వేడుకలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో 21 మంది స్వల్పంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. జి.రాగంపేట గ్రామంలో శుక్రవారం ఉదయం జి.రాగంపేటకు చెందిన అబ్బాయికి, ఐ.పోలవరం మండలం ఎదురులంక పంచాయతీ గుత్తుల వేమవరంకు చెందిన అమ్మాయికి వివాహం జరిగింది. అనంతరం డిజె పాటలు విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో 21 మంది స్వల్పంగా గాయపడగా వారిని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటి వద్ద నుంచి అదృశ్యమైన వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జొన్నాడ గౌతమి గోదావరి నది చెంతన ఉన్న వ్యవసాయ పొలంలో శుక్రవారం వెలుగుచూసింది. ఎఎస్ఐ సూర్యచంద్రరావు తెలిపిన వివరాలు ఇవి. రావులపాలెంకు చెందిన కుడిపూడి శ్రీను(39) ఇంటి దగ్గర నుంచి అదృశ్యమై అనుమానస్పద స్థితిలో మృతి చెందారన్నారు. తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుని 25 గాయాలు ఉండగా, ఘటన స్థలంలోవివరాలు సేకరించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. దీనిపై మృతుని తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు మత్స్యకారుడి మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పిడుగుపాటుకు వేటాడుతున్న మత్స్యకారుడు మృతి చెందాడు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చల్లపల్లి పంచాయితీ తీర గ్రామమైన వాసాలతిప్పకు చెందిన కర్రి లీలా కృష్ణ (39) శుక్రవారం ఉదయం గ్రామంలోని చెరువుల వద్దకు వేటకు వెళ్ళాడు. లీలా కృష్ణ చేపల వేటాడుతుండగా అకస్మాత్తుగా అతనిపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లీలా కృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లీలా కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని కోమటికుంట పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్టు దేవరపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ దాడులలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వసం చేసినట్లు తెలిపారు. సారా తయారు చేస్తున్న చుక్కా సుబ్బారావును అరెస్టు చేసినట్టు తెలిపారు. గోపాలపురంలో సారా అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

ఆక్రమణల నివారణకు చర్యలు : జెసి

ప్రజాశక్తి - కాకినాడ



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

జిల్లాలోని చెరువులు, కాలువలు, డ్రెయిన్లు, వాగులు తదితర వాటర్ బాడీస్ ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వాటర్ బాడీస్ సంరక్షణపై జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ తొలి సమావేశం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు, దుర్వినియోగాల వల్ల జలవనరులు అంతరించి దుష్పరిణామాలకు దారి తీసే పరిస్థితులు ఉంటాయన్నారు. కావున రెవెన్యూ అధికారుల అధ్యక్షతన, మున్సిపల్, పంచాయితీ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ తదితర శాఖల అధికారులు సభ్యులుగా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఈ వాచ్ డాగ్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా రికార్డులలో నమోదైన చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, డ్రెయిన్లు తదితర వాటర్ బాడీస్ వివరాలను పరిశీలించి, వీటిలో ఇప్పటికే గుర్తైన వ్యవస్థలను గుర్తించాలని, అలాగే ఇకపై ఆక్రమలు జరుగకుండా నిరోధించాలని ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయితీ, మున్సిపల్, కుడా యాజమాన్యంలో ఉన్న చెరువులకు కంచెలు ఏర్పాటు ద్వారా పరిరక్షించాలని సూచించారు. కాలువలు, చెరువుల గట్లను డంపింగ్ యార్డులుగా వాడకూడదన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లోని కాలువ గట్లపై కొబ్బరి బొండాలను, కూల్చిన భవన శిధిలాలు డంప్ చేయడం వల్ల ప్రవాహాలు కుచించుకుపోతున్నాయని, కాలువలను ధ్వంసం చేస్తున్నా వారిపై కఠిన చర్యలు చేపట్లాలని ఆదేశించారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లోని జనావాసాల మురుగునీరు కాలువలు, చెరువుల్లోనికి విడిపెట్టకుండా నిరోధించాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా నిర్వహిస్తామని, వచ్చే సమావేశానికి జిల్లాలోని వాటర్ బాడీల వివరాలు, వాటిలో జరిగిన ఆక్రమణలు, ఆక్రమణ విస్తీరణంలో ఉన్న పంటల సాగు, సివిల్ నిర్మాణాలు వివరాలు, కోర్టు వివాదాలు, ఇకపై ఆక్రమణలకు గురికాకుకండా చేపట్టిన చర్యలపై సమగ్ర వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జె.వెంకటరావు, మున్సిపల్ ఆర్‌డి. ఆర్.నాగనరశింహారావు, డిపిఒ వి.రవికుమార్, ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఇఇ శేషగిరిరావు, కాలుష్య నియంత్రణ మండలి, కుడా, డ్రెయినేజి, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఇ సెట్ సత్తా చాటిన ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇ-సెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్ సతీష్‌రెడ్డి తెలిపారు. ఎపి ఇ-సెట్ 2025 పరీక్ష ఫలితాలలో తమ ఆదిత్య విద్యార్థులు మద్దారి వినయ్ స్టేట్ 5వ ర్యాంకు, చీకోలు అమృత స్టేట్ 8 ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయి టాప్ 10లో 2 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వీటితోపాటు 100 లోపు మొత్తం 41 ర్యాంకులను తమ కళాశాల విద్యార్థులు సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్, డీన్ ఎవి.మాధవరావు, అసోసియేట్ డీన్ పి.శ్రీనివాస్ వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.



విజయం సాధించిన హరికృష్ణ, చరణ్ రామ్

బాడ్మింటన్‌లో హరికృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేటకు చెందిన వి.హరికృష్ణ తోటి క్రీడాకారుడు టి.చరణ్‌రామ్‌తో కలిసి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాడ్మింటన్ బాయ్స్ డబుల్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభను చాటాడు. మే 13న బీహారలో జరిగిన బాడ్మింటన్ బాయ్స్ డబుల్స్ విభాగంలో తమిళనాడుకి చెందిన నెంబర్ వన్ సీడ్ విశ్వజిత్‌రాజ్, నిరంజన్‌పై 19 - 21, 21 - 19, 21 - 16 తేడాతో విజయం సాధించారు. ఖేలో ఇండియా బ్యాడమెంటేన్‌లో ప్రతిభను కనపరచిన హరికృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.

వైద్యానికి ఎంఎల్ఎ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సామర్లకోట


బాజతునికి నగదును అందిస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని హుస్సేన్ పురం గ్రామానికి చెందిన పుప్పాల పూర్ణదుర్గాప్రసాద్ వైద్యానికి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. హుస్సేన్‌పురం గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి బాధితుడు అనారోగ్య పరిస్థితిని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రూ.50 వేలు ఆర్థిక సాయం చేయడంతోపాటు, అతని ఆరోగ్య భద్రత కోసం అవసరమైన సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారని బుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట చిన్నఅప్పారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తాళ్ళరేవు


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

మండలంలో సుమారు రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపిపి ఎంపిపి రాయుడు సునీత తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంపి హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సహకారంతో మండలంలో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. మండల పరిషత్ నిధులు రూ.కోటితో అన్ని గ్రామాల్లోనూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.10 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేశామని తెలిపారు. మరో రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మండల అభివృద్ధికి సహకరిస్తున్న ఎంపి, ఎంఎల్ఎలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపిఒ సత్యనారాయణ, టిడిపి నాయకులు రాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్‌సి కమిషన్ చైర్మన్‌కు కుమార్ అభినందన

ప్రజాశక్తి - సామర్లకోట


జవహర్‌ను సత్కరిస్తున్న కుమార్, యార్లగడ్డ శేఖర్

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పదవిని కెఎస్.జవహర్‌కు ఎఐఎండిఎస్ జాతీయ అధ్యక్షులు, టిడిపి నాయకులు కాపవరపు కుమార్ అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక బళ్ళ మార్కెట్ సెంటర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపినట్లు తెలిపారు. పార్టీ కోసంకష్టపడిన జవహర్‌కు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పదవి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తింపును ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు యార్లగడ్డ శేఖర్, సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ అడబాల వీరభద్రరావు, వనమాడి ఉమాశంకర్, కాపవరపు జాను, బోస్, పాల్గొన్నారు.

21 నుంచి 24 వరకు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - కాకినాడ

సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణపనుల్లో భాగంగా ఈ నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లుకలెక్టర్ షాన్ మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనుల వల్ల నాలుగు రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు జరుగుతున్న రహదారి పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్‌లో గడ్డర్లు లేపుతున్నందున ఈ నెల 27, 28 తేదీలలో (రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు) రెండు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, వాహనదారులు గమనించి పోలీసు వారు సూచించిన మార్గాలలో తమ వాహనాలను నడుపుకోవాలని కలెక్టర్ తెలిపారు.

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించరాదు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించరాదని పోలీసు కానిస్టేబుల్ దిలీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మానవ తప్పిదాలేనని అన్నారు. వేగంగా వాహనాలు నడపడం, మద్యం తాగి వాహనాన్ని నడపడం, ఓవర్ టేకింగ్, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వలన అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

రాయితీ రుణాలపై అవగాహన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ రుణాలపై డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉప్పాడ మహిళా సమాఖ్య కార్యాలయంలో మత్స్యకార మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిపిఎం బాబురావు మాట్లాడారు. ఎండు చేపల తయారీపై మత్స్యకారులకు రాయితీ రుణాలను ప్రభుత్వం అందిస్తుందని, మత్స్యకార మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేశవరావు, వెంకటేశ్వరరావు, డిఐసి విజయ్‌కుమార్, ఎపిఎం తవుడు, సిసి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాంపుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఇసుక రీచ్‌ల నుంచి లోడుతో వెళుతున్న వాహనాల నుంచి జారి పడుతున్న ఇసుక వల్ల ప్రమాదాలు జరగకుండా ర్యాంపుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దారు భారతి, ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. బోట్ మాన్ సొసైటీ సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇసుక లోడుతో బయలుదేరిన లారీల నుండి ఇసుక రోడ్డుపై పడడంతో తరచూ వాహనదారులు ఇబ్బందులు గురి అవుతుండడంతో ప్రమాదాల నివారణకు కొన్ని ప్రాంతాల్లో, ముఖ్య కూడళ్ళలో స్పీడ్ బ్రేకర్లు బిసినప్పటికీ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి రావడంతో ఈ సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఇసుక లోడుతో వెళ్లే లారీలపై బరకాలు కప్పడంతోపాటు ఆయా రాంపుల వద్ద అద్దాలు ఏర్పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిం చారు. సమావేశంలో ఆర్ఐ రామకృష్ణ బోట్ మెన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో యువతకు ఉద్యోగ భరోసా

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్ర యువతకు ఉద్యోగ భరోసా కల్పించే విధంగా నైపుణ్య శిక్షణ కార్పొరేషన్ పని చేస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ శుక్రవారం తెలిపారు. విజవాడలోని నైపుణ్య శిక్షణ కార్పొరేషన్ కార్యాలయంలో ఎండి జి.గణేష్‌కుమార్‌తో ఎంపీ హరీష్ సమావేశమయ్యారు. ఇటీవల ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తో హరీష్ జరిపిన చర్చల కొనసాగింపుగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. స్కిల్ ఇండియా మిషన్ లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ కార్యక్రమాల పురోగతి, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై ఈ సమావేశంలో సమీక్షించా మన్నారకు. ఈ ప్రాజెక్టులో ఎదుర్కొంటున్న సమస్యలను, సవాళ్లను వారిని పరిష్కార మార్గాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.య ుువతను నైపుణ్యంలో తీర్చిదిద్ది వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ లక్ష్యాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆత్మనిర్భర్ భారతదేశం దిశగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేస్తున్నాయని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

ఇసెట్ ర్యాంకర్లకు పలువురి అభినందనం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇటీవల ఇసెట్ ఫలితాల్లో పలువురు ప్రతిభ కనబరచి ర్యాంకులు సాధించారు. వీరికి పలువురు శుక్రవారం అభినందనలు తెలిపారు.వివరాలు ఇవి..

అమలాపురం: ఇటీవల ప్రకటించిన ఇ సెట్ లో సివిల్ ఇంజినీరింగ్ విభాగం లో అమలాపురానికి చెందిన పితాని యజ్ఞేశ్వరి రాష్ట్ర స్థాయి 28వ ర్యాంక్ సాధించింది. శు ఆమెకు పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇఇ అన్యం రాంబాబు, ఇఇ పులి రామకృష్ణా రెడ్డి, కాంట్రాక్టర్ ఆంజనేయరెడ్డి, ఎఇఇలు సత్యనారాయణ, కొండలరావు తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు. **మామిడికుదురు:** ఎపి ఇసెట్‌లో (అగ్రికల్చరల్ ఇంజినీరింగ్)ఆదుర్రుకు చెందిన గుబ్బల సాయి మణిరత్నం రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించారు. మణిరత్నం తండ్రి లక్ష్మణరావు, తల్లి శ్యామలాదేవి వ్యవసాయం కుటుంబానికి చెందిన వారు. మణిరత్నం మాట్లాడుతూ రైతులకు అందుబాటులో మేలైన యంత్ర పరికరాలు తయారు చేయాలని, అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యముతో వ్యవసాయ శాస్త్ర వేత్త గా గుర్తింపు పొందాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. ఇ సెట్ లో (బి ఎస్‌సి మ్యాథమెటిక్స్‌లో) మొగలికుదురుకు చెందిన గోగి మోహిని స్పందన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాస్థాయిలో 8 వ ర్యాంకు సాధించారు. ఆమె తండ్రి సత్యనారాయణ రైతు, తల్లి వెంకటలక్ష్మి గృహిణి. స్పందన మాట్లాడుతూ బిటెక్ పూర్తి చేసి సివిల్స్ చదవాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

గోదావరిలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాస్తు కాలుజారి ఒక యువకుడు గౌతమీ గోదావరి నదిలో గల్లంతైన సంఘటన ఆత్రేయపురంలో చోటుచేసుకుంది. పోలీసు వివరాలు ప్రకారం ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తలపాకుల జగపతిబాబు హైదరాబాదులో ఒక కంపెనీలో ఆఫీస్ బాయ్ గా పని చేస్తున్నాడు. ఆత్రేయపురం బుల్లి పేట లో ఉన్న తన మేనమామ కుమారుడు పుట్టినరోజు వేడుకలకు శుక్రవారం వచ్చాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గౌతమి గోదావరి నది తీరానికి బహిర్భూమికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ జగపతిబాబు ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రాము తెలిపారు...

కౌలు రైతుల గుర్తింపు కార్డుల దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు కౌలు కార్డులు (సిసిఆర్‌సి) పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు శ్రీనివాస్ కోరారు. ఇది కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు పొందడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కౌలు రైతులు తమ దరఖాస్తులను పూర్తి చేసి, అవసరమైన పత్రాలతో పాటు సమర్పించాలని తహశీల్దారు సూచించారు. కౌలు రైతు సాగు చేస్తున్న భూమికి సంబంధించిన వివరాలు, భూ యజమాని పేరుతో సహ స్పష్టంగా పేర్కొనాలని, దరఖాస్తుదారుని ఆధార్ కార్డు కాపీ జతపరచాలని తెలిపారు. ఇటీవల తీసిన పాస్‌పోర్ట్ సైజు ఫోటో, దరఖాస్తుదారుని సంప్రదించడానికి ఫోన్ నంబర్ ఇవ్వాలని తెలిపారు. కౌలు రైతులు ఏ గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారో, ఆ గ్రామంలోని విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, గ్రామ వ్యవసాయ సహాయకులకు తమ దరఖాస్తులను అందజేయాలని, ఈ దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన రైతులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చేస్తామని తెలిపారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సకాలంలో దరఖాస్తు చేసుకుని కౌలు కార్డులు పొందాలని ఆయన సూచించారు.

ఆకతాయిలకు శిక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

మండపేట పట్టణంలో గురువారం రాత్రి మద్యం తాగి న్యూసెన్స్ చేస్తున్న పదిమంది నిందితులను స్థానిక ఎస్ఐ అరెస్టు చేసి శుక్రవారం ఆలమూరు సివిల్ కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో వారందరికీ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ రూ.100 జరిమానాతో పాటు వారితో పరిసరాలను శుభ్రం చేయించాలని శిక్షను విధించారు. దీంతో పోలీసుల పర్యవేక్షణలో స్థానిక ట్రెజరీ కార్యాలయాన్ని వారితో అధికారులు శుక్రవారం శుభ్రం చేయించారు.


నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత బృందంతో వీధి నాటకం ద్వారా హెచ్‌ఐవి, ఎయిడ్స్ సుఖ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు, సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై వీధి నాటకం ద్వారా వివరించారు. ఈ నెల 13 నుంచి 19 వరకు నటరాజ నిలయ చర్మచిత్ర కళా ప్రదర్శన కమిటీ ద్వారా కళాజాత బృందాలతో వీధి నాటకాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మేనేజర్ నవీన్‌చంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ భాష, ఐసిటిసి కౌన్సిలర్ ఎన్.లక్ష్మి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెటరీ పరీక్షలు పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట


కళాశాలను సందర్శించిన డిఐఇడి శారద

సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీ డియేట్ అడ్వాన్స్ సప్లిమెం టరీ పరీక్షల నిర్వహణను శుక్రవారం డిఐఇడి ఐ.శారద పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేవారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. 353 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సివుండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్టు ప్రిన్సిపల్ సిహెచ్‌ఎల్ శ్రీదేవి తెలిపారు.

పంట బోదెలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - ఆలమూరు

పెదపల్ల గ్రామంలో పంట బోదెలో పూడిక శుక్రవారం తొలగించారు. ఈ పనులను చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గారపాటి శ్రీనివాసరావు పరిశీలించారు. మండలంలోని పెదపళ్ళ గ్రామంలో మురుగు నీరు పంట బోదెలో నిలువ ఉండి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని శ్రీనివాసరావు దష్టికి రైతులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఎంపిడిఒ ఎ.రాజు, గ్రామ సర్పంచ్ సత్యశ్రీ మెహర్ ప్రసాద్, సెక్రెటరీ వేణిలతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. దీంతో ఎంపిడిఒ రాజు పంచాయతీ అధికారులకు పరిశుభ్రం చేయించాలని ఆదేశించారు. పంటబోదెలో శుక్రవవారం పూడిక తొలగించారు. కార్యక్రమంలో విఆర్‌ఓ ఉదయ్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ఆధునికీకరించాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి లంక లో రోడ్డు ఆధునికీకరించాలని గ్రామంలో ఒఎన్‌జిసి డ్రిల్లింగ్ సైట్ ఎదుట శుక్రవారం రైతులు ధర్నా నిర్వహించారు. సుమారు 200 అడుగులు మేర రోడ్డు నిర్మించాలంటూ రైతులు డిమా ండ్ చేశారు. దీనికి సంబంధించి వినతి పత్రాన్ని డిల్లింగ్ సైట్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ కు అందజేశారు.